క్లుప్తంగా

విఘ్నేశ్వరుని సన్నిధిలో చిన్నపరెడ్డి



విఘ్నేశ్వరుని సన్నిధిలో ఆడిట్ అధికారి చిన్నపరెడ్డి కుటుంబ సభ్యులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని ఏలూరు ఆడిట్ డిపార్ట్‌మెంట్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ బి.చిన్నపరెడ్డి కుటుంబ సభ్యులతో శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చిన్నపరెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం



గొందిలో కరెంటు షాక్ బాధిత విద్యార్థికి సాయం చేస్తున్న ఎస్సై దుర్గా శ్రీనివాసరావు

సఖినేటిపల్లి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో లయన్ చిల్డ్రన్స్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గొంది గ్రామంలో ఇటీవల కరెంటు షాక్‌కు గురై చికిత్స పొందుతున్న విద్యార్థిని బర్రె దుర్గా భవానికి, ఫౌండేషన్ ఫౌండర్ తాడి మున్ మోహన్‌రెడ్డి సభ్యుల సహకారంతో సమకూర్చిన రూ.21 వేల నగదును ఎస్సై అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు, సర్పంచ్ దొండపాటి రవికుమార్, నాయకులు తాడి సత్యనారాయణ, తాడి సహదేవ్, వినోద్, రవీంద్ర, రాజేష్, పోతురాజు కృష్ణ, బొలిశెట్టి గణేష్, కొల్లు రాము, జే ఉదయ్ కిరణ్, పమ్మి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

14 నుంచి పల్లె పండగ కార్యక్రమాలు

సఖినేటిపల్లి: ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ రాజోలు నియోజకవర్గంలో పల్లె పండగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలో ఆయా గ్రామాల్లో నిర్దేశించిన తేదీల్లో పల్లెపండగ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీవీ సత్యనారాయణ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో అన్నారు. ఇందులో ఎన్ఆర్‌జీఎస్ పథకం, 15వ ఆర్థిక సంఘం గ్రాంటు నుంచి మంజూరైన 38 పనులకుగాను శంకుస్థాపనలు జరగనున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాలకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

ఘనంగా ఎన్‌జేఎం వార్షిక వేడుకలు

పి.గన్నవరం: పెదకందాలపాలెం న్యూజెరూషలెం ప్రార్థనా మందిరంలో శుక్రవారం రెవరెండ్ జి.దానియేలు ఆధ్వర్యంలో ఎన్‌జేఎం 24వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సభలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దైవజనులు భాస్కరరావు, కె.జాన్‌ఫిలిప్, లాజరస్ జోసఫ్ మాట్లాడుతూ ఎన్‌జేఎం అధినేత దానియేలు గత 24 ఏళ్లు కోనసీమ వ్యాప్తంగా అందిస్తున్న ప్రజా సేవలను అభినందించారు. దానియేలు దంపతులను సంఘ సభ్యులు, క్రైస్తవ విశ్వాసులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి యు.జాన్ బాబు, కరుణకుమార్ పాల్గొన్నారు.

రతన్‌టాటా మృతి తీరని లోటు

కొత్తపేట: ప్రపంచ వ్యాపార దిగ్గజం, వేలాది మందికి ఉద్యోగ ప్రదాత రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ ముసునూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రతన్‌టాటా మృతితో దేశం ఓ పారిశ్రామిక దిగ్గజాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఓ వ్యాపారవేత్తగానే కాకుండా దేశానికి విస్తృత సేవలను అందించారన్నారు. మరీ ముఖ్యంగా అజ్ఞాత విరాళాల దాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందించిన దాతగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

కల్యాణ మండపానికి శాపాలెన్నో..

- పట్టించుకునే వారు కరవు
- కళావిహీనంగా మండపం
- వెంటాడుతున్న నిర్వహణ లోపం



కళావిహీనంగా దర్శనమిస్తున్న కల్యాణ మండపం

ఆత్రేయపురం: టీటీడీ ఆధ్వర్యంలో లక్షలు పోసి కల్యాణ మండపాలు నిర్మిస్తున్నారు. వాటి నిర్వహణ పట్టించుకునే నాథులు మాత్రం కరువయ్యారు. ఈనెల 3 నుంచి శుభముహూర్తాలు మొదలైనా కల్యాణ మండపం గురించి పట్టించుకునే వారే లేరని పలువురు విమర్శిస్తున్నారు. మండల కేంద్రమైన ఆత్రేయపురంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన భారీ కల్యాణ మండపానికి శాపాలెన్నో ఎదురవుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండపం లోపల నీరు నిలిచిపోవడంతో పెళ్లిళ్ల తదితర శుభకార్యాలు చేసుకునే ప్రజలు బుకింగ్ చేసుకునేందుకు ముందుకు వెళ్లడం లేదు. గతంలో బుకింగ్‌లు చేసుకునేందుకు టీటీడీ అధికారులు చాలా కాలం నిలిపివేశారు. ఈ ప్రాంతంలో ఎటువంటి కల్యాణ మండపాలు లేకపోవడంతో ఇక్కడ కల్యాణ మండపానికి మంచి గిరాకీ ఉంది. కేవలం రూ.1500 ధరతో బుక్ చేసుకోవచ్చు. కానీ సంబంధిత నిర్వహకులు ఇక్కడ అందుబాటులో లేకపోవడం అందులో లైటింగ్ , వంట సామాన్లు తదితర ఏర్పాట్లు అనుకూలంగా లేకపోవడం మరో శాపం. ఈ కల్యాణ మండపం భారీ పెళ్లిళ్లకు శుభకార్యాలకు అనువుగా ఉంటుంది. కోనసీమలో మొదటి కల్యాణ మండపంగా ఇక్కడ దాతలు నిర్మించి ముందు చూపుతో వ్యవహరించారు. నాటి పాలకులు సైతం ప్రోత్సాహం అందించారు. ఇటీవల టీటీడీ నుంచి కానీ పాలకుల నుంచి గానీ అనుకూల పరిస్థితులు లేకపోవడంతో కల్యాణ మండపం అభివృద్ధి చతికిలపడింది. ఈ ప్రాంతంలో శుభకార్యాల ముహూర్తాల్లో ఈ కల్యాణ మండపానికి మంచి గిరాకీ ఉన్నప్పటికీ ప్రచారం, ప్రోత్సాహం లేక హెచ్చు సంఖ్యలో కార్యక్రమాలు జరగడం లేదు. చిన్నపాటి జన్మదిన వేడుకలు, శుభకార్యాలు తక్కువ అద్దెతో నిర్వహించుకునే అవకాశాలు ఉన్నప్పటికీ నిర్వాహకులు సహకరించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో హెచ్చు శుభకార్యాలు ఈ కల్యాణ మండపంలో జరిగిన దాఖలాలు ఉన్నాయి. ఈ మండపంలో శుభకార్యాలు జరగడానికి తక్కువ పెట్టుబడితో ఏర్పాట్లుచేయాల్సి ఉన్నా అధికార్లు ముందుకు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కల్యాణ మండపాల్లో ఏసి సౌకర్యం సైతం కల్పించి ప్రజలకు ఆకట్టుకుంటున్నారు. కానీ ఇక్కడ మాత్రం కల్యాణ మండపం నిర్మించిన దాతల ఆశయం నెరవేరడం లేదు. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ కల్యాణ మండపంలో వసతులు మెరుగపరచి శుభకార్యాలు జరగడానికి అనువుగా తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నీటిని బయటకు తరలించాలి



టీటీడీ కల్యాణ మండప నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి శుభకార్యాలు ఇందులో జరిగే విధంగా కృషి చేయాలి. కల్యాణ మండపానికి వెంటనే రంగులు వేసి శుభకార్యాలకు అనువుగా తీర్చిదిద్దాలి. అలాగే మండపం లోపల నిలిచిపోయిన నీటిని తరలించి శుభ్రపరచాలి.

– గాదిరాజు రామకృష్ణంరాజు, వసంతవాడ

అధికారుల పర్యవేక్షణ కరవు



టీటీడీ అధికారుల కల్యాణ మండపం పర్యవేక్షణ లేకపోవడంతో శుభకార్యాలు జరుపుకొనే వారికి ప్రోత్సాహం కరువవుతుంది. బుకింగ్‌లు చేసుకోవడానికి సైతం నిర్వాహకులు అందుబాటులో ఉండటం లేదు. మరిన్ని శుభకార్యాలు జరగడానికి కృషి చేయాల్సిన సిబ్బంది అలసత్వం ప్రదర్శించి అందుబాటులో ఉండటం లేదు.

– సాగిరాజు రామకృష్ణంరాజు, ఆత్రేయపురం

31వ రోజుకు చేరిన అధ్యాపకుల దీక్షలు



దీక్షలో కూర్చొన్న అధ్యాపకులకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: డిగ్రీ కాలేజీ అధ్యాపకులు చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారం 31వ రోజుకి చేరుకున్నాయి. నాలుగు నెలలుగా పెండింగ్ పడిన జీతాలు చెల్లించమని కాలేజీ సిబ్బంది పోరాటం చేస్తున్న సంగతి అందరికీ విదితమే. వారి సమస్య సానుకూలంగా పరిష్కరించవలసిన సెక్రటరీ కరెస్పాండెంట్ నెల రోజులు గడిచినా అధ్యాపకులతో చర్చలు జరపకపోవడం శోచనీయం అని పలువురు నాయకులు తెలిపారు. మాజీ శాసన సభ్యుడు రాపాక వర ప్రసాద్, స్థానిక నాయకులు గెడ్డం తులసీభాస్కర్, అశోక్, ఫిలిప్‌రాజు, చింతా రాజబాబు, నల్లి మోహన్‌రావు, గెడ్డం పేర్రాజు, రంపాల రాజు, దేశినీడి ఉదయ్ భాస్కర్, నల్లి శివకుమార్, నేతల నాని, ముద్దల శ్రీనివాస్, చెల్లింగి అబ్బులు అధ్యాపకులకి సంఘీభావం తెలిపారు.

ఎమ్మెల్యే దేవను కలసిన డీపీఓ



ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీపీఓ శాంతలక్ష్మి

మలికిపురం: జిల్లా నూతన పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డి.శాంతలక్ష్మి శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మలికిపురంలో ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పంచాయతీల్లో పాలన మెరుగైన రీతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీపీఓకు ఎమ్మెల్యే సూచించారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం



కొత్తపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గోపీమూర్తి

కొత్తపేట: రాజీలేని పోరాటం చేయడం ద్వారా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని యూటీఎఫ్ బలపర్చిన పీడీఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం కొత్తపేటలో యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి గోపీమూర్తి మాట్లాడుతూ 2ప్రేళ్లుగా అన్ని ఉపాధ్యాయ ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నానని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. శాసన సభలో ఉపాధ్యాయ గొంతును వినిపించడానికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వై.మురళి, వైవీఎస్ఎన్ బాలాజీ, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు టి.విజయకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి జి.రామ్‌కుమార్, జేవీవీ జిల్లా కార్యదర్శి ఎండీ ఖాజామొహిద్దీన్, యూటీఎఫ్ నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, బి.నారాయణరావు, కాశీ, రామకృష్ణ, బి.ప్రసాద్, జి.ప్రసాద్, సీహెచ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యంతో మెరుగైన ఆరోగ్యం



సూర్యారావుపేటలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని సాధించవచ్చని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. వర్షాకాలం సీజనల్ దృష్ట్యా అంటువ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలన వివరించారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

30 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్ట్

కొత్తపేట: మండలంలోని వాడపాలెం లాకుల సమీపాన సారా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. రహస్యంగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేయగా వాడపాలెం లాకుల దాటాక ఏటిగట్టు సమీపంలో వాడపాలెం పెదపేటకు చెందిన ఉరం సురేంద్ర, ఉరం రాంబాబు అనే వ్యక్తులు సారా తయారు చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 30 లీటర్ల సారా, తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా 15 రోజులు రిమాండ్ విధించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

- 20 దుకాణాలకుగాను 427 దరఖాస్తులు
- అత్యధికం ఆలమూరులోనే..



ఐడీ నాగేశ్వరరావు

ఆలమూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆలమూరు మండలంలోని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలోని 20 మద్యం దుకాణాలకు తుది గడువు ముగిసే శుక్రవారం రాత్రికి 427 మద్యం దరఖాస్తులు అందాయి. తొలుత మందకొడిగా సాగిన దరఖాస్తుల ప్రక్రియ తరువాత వేగం పుంచుకుంది. తొలి గడువు ముగిసే నాటికి 300 దరఖాస్తులు రాగా రెండు రోజుల గడువు పొడిగింపుతో మరో 127 దరఖాస్తులు వచ్చాయి. దీంతో కేవలం దరఖాస్తు ఫీజు ద్వారానే స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో రూ.8.54 కోట్ల ఆదాయం లభించింది. రెండు రోజుల గడువు పొడిగింపు ద్వారా అందులో రూ.2.54 కోట్ల ఆదాయం లభించినట్లయింది. ఆలమూరులో ఐదు దుకాణాలకు 139, కపిలేశ్వరపురంలో నాలుగు దుకాణాలకు 83, మండపేట రూరల్‌లో ఆరు దుకాణాలకు 123, మండపేట పట్టణంలో ఐదు దుకాణాలకు గాను 82 దరఖాస్తులు అందినట్లు సీఐ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. సర్కిల్ పరిధిలో అత్యధికంగా ఆలమూరు మండలానికి, అతి తక్కువగా మండపేట పట్టణానికి దరఖాస్తులు నమోదయ్యాయి.

గల్ఫ్ కథలు ఆధారంగా వెబ్‌సిరీస్ సీరియల్



ఉయ్యూరువారి మెరకలో మంగతాయారు టిఫిన్ సెంటర్ వెబ్ సిరీస్‌కు ముహూర్తం షాట్‌లో ప్రతాప్

సఖినేటిపల్లి: స్వీయ రచనలోని గల్ఫ్ కథలు ఆధారంగా వెబ్ సిరీస్‌లో సాగే సీరియల్‌ను తెరకు ఎక్కించనున్నట్టు ప్రముఖ కథా రచయిత, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శుక్రవారం ఉయ్యూరువారి మెరకలో సీరియల్‌లో భాగంగా తొలుత మంగ తాయారు టిఫిన్ సెంటర్ చిత్రం కథను తెరకెక్కిస్తున్నామని ఆయన అన్నారు. ఈ మేరకు ముహూర్తం షాట్‌కు కెమెరా స్విచ్ ఆన్ ప్రతాప్ చేశారు. గల్ఫ్ వీసాలు పేరుతో జరిగే మోసాలు, ఏజెంట్ మోసాలపై ప్రధానంగా చిత్రీకరిస్తున్నట్టు చెప్పారు. కాగా బీవీఆర్ క్రియేషన్ బ్యానర్‌పై యువ దర్శకుడు జి.హరికృష్ణ, నిర్మాతగా బి.వెంకట్రావు మంగతాయారు టిఫిన్ సెంటర్ సిరీస్‌ను తీస్తున్నారు.

చట్ట విరుద్ధంగా విక్రయిస్తే సీజ్ చేస్తాం

అంబాజీపేట: ఎటువంటి అనుమతులు లేకుండా చట్ట విరుద్ధంగా బహిరంగ ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ విక్రయిస్తే షాపులను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి హెచ్చరించారు. ముక్కామలలో పెట్రోల్ బంక్ సమీపాన రహదారి వెంబడి పెట్రోల్ విక్రయిస్తున్న షాపు నిర్వాహకులకు ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్వో కోమలిలు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పెట్రోలు విక్రయిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జయజయహే మహిషాసురమర్దిని

- కిటకిటలాడిన ఆలయాలు
- భక్తుల ప్రత్యేక పూజలు



పెదపట్నంలంకలో సిద్ధిదాయిని అవతారంలో కనకదుర్గమ్మ



తాటికాయలవారిపాలెంలో దుర్గాదేవి అవతారంలో కనకదుర్గమ్మ



ఉచ్చిలిలో మహిషాసురమర్దినిగా విజయదుర్గాదేవి



అంబాజీపేటలో నిమ్మకాయల అలంకరణలో విజయ దుర్గాంబిక

కొత్తపేట: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం దుర్గాదేవి ఆలయాలు, శరన్నవరాత్ర పందిళ్లలో అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బొరుసువారిసావరం విజయకనకదుర్గాదేవి అమ్మవారిని ఆలయ పునర్నిర్మాణ కర్త, ఆలయ పోషకుడు బొరుసు వెంకటఉదయభాస్కర్ – వసుధ దంపతుల పర్యవేక్షణలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పసుపులేటి శ్రీనివాస్–సత్యవేణి దంపతులు, అర్చకుల ఆధ్వర్యాన అమ్మవారిని మహిషాసుర్దనిగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహర్నవమి పర్వదినం ఆలయ ప్రాంగణంలో వాసు దంపతులతో పాటు పలువురు భక్త దంపతులతో మహాలక్ష్మీ హోమం నిర్వహించారు. కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి, గ్రామదేవత బంగారమ్మ అమ్మవారు. ఏనుగులమహల్ శ్రీరాజరాజేశ్వరాదేవి (శ్రీచక్రమహామేరు యంత్రం), బోడిపాలెం దుర్గాదేవి, వాడపాలెం జ్ఞానసరస్వతీదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

సఖినేటిపల్లి: అంతర్వేదికరలోని భవానీ సెంటర్‌లో శుక్రవారం దేవీ నవరాత్ర మహోత్సవాలు పురస్కరించుకుని దుర్గామాత అమ్మవారి గ్రామోత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మహిషాసురమర్దని అవతారంలో దర్శనమిచ్చిన దుర్గామాతను గ్రామోత్సవంతో ఇంటింటా భక్తులు, పిల్లలు దర్శించుకున్నారు. అరటిపళ్లు, కొబ్బరికాయలు నైవేద్యాలుగా సమర్పించుకున్నారు. దీంతో గ్రామం అంతటా పండుగ వాతావరణం నెలకొంది.

మామిడికుదురు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం మహర్నవమి సందర్భంగా పలు కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు సిద్ధిదాయిని అవతారంలో భక్తులకు కనువిందుగా దర్శనమిచ్చారు. పాశర్లపూడిబాడవ కనకదుర్గమ్మ సన్నిధిలో కుమారీ పూజ, సువాసినీ పూజ, శమీ పూజ, గోపూజ, ప్రత్యేక కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారు దసరా మహోత్సవాల సందర్భంగా తొమ్మిదో రోజైన శుక్రవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. అలాగే పి.గన్నవరం ఏజీ రోడ్డులో శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. శ్రీశరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని నూకాలమ్మ అమ్మవారి ఆవరణలో ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజకి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన శ్రీదేవి మండపాల్లో దుర్గాష్టమి, మహర్నవమి పర్వదినాల సందర్భంగా అమ్మవారు మహిషాసురమర్దిని రూపంలో దర్శనమిచ్చారు. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఆత్రేయపురం: మండల గ్రామాల్లోని దేవి ఆలయాల్లో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉచ్చిలిలో వేంచేసిన విజయదుర్గాదేవి అమ్మవార్ని మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ మాలధారులు, భక్తులు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. లొల్ల లాకుల వద్ద విజయ కనక దుర్గాదేవికి కుంకుమతో ప్రత్యేక పూజలు చేశారు. లొల్ల గ్రామంలో లొల్లాలమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు.

దుర్గమ్మకు 9999 నిమ్మకాలతో అలంకరణ

అంబాజీపేట: స్థానిక వీరభద్ర థియేటర్ సమీపాన ఉన్న విజయదుర్గాంబిక (నిమ్మకాయల దుర్గమ్మ) అమ్మవారిని 9999 నిమ్మకాయలతో శుక్రవారం అలంకరించారు. పి.గన్నవరంకు చెందిన యాండ్ర వీవీ సత్యనారాయణ, విజయకుమారి, పితాని రాంబాబు, శ్రీదుర్గా దంపతులు సమకూర్చిన 9999 నిమ్మకాలతో దుర్గమ్మను, ఆలయాన్ని అలంకరించారు. అంతకుముందు ఆలయ అర్చకులు గూడూరి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ కల్యాణ మండపంలో శ్యామలాంబకు 200 మంది మహిళలు లక్ష కుంకుమార్చన చేపట్టారు.



కొత్తపేట బి.సావరం ఆలయంలో పూజలు చేస్తున్న వాసు-సత్యవేణి దంపతులు



చింతలూరులోని నూకాలంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు